క్లుప్తంగా

ఎరువుల దుకాణం తనిఖీ

సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామంలో ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని డీలర్‌ను ఆదేశించారు. అదే విధంగా స్టాక్ నిల్వలు తెలిసేలా బ్లాక్ బోర్డు పైన వివరాలు పొందుపర్చాలని సూచించారు.

విద్యార్థులకు పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ రాజ్‌కుమార్

సాలూరు: జన్ భాగిదర్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, తదితర నియోజకవర్గ స్థాయి పోటీలను స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఈ పోటీలను సాలూరు, పాచిపెంట, మక్కువ ఎంఈఓలు రాజ్‌కుమార్, జోగారావు, సత్యనారాయణ, తదితరులు పర్యవేక్షించారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంల వినియోగాన్ని వివరిస్తున్న ఎన్నికల అధికారులు

వీరఘట్టం: ఈవీఎం యంత్రాల ద్వారా ఓటు హక్కు వినియోగించడంపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ అన్నారు. వీరఘట్టం మేజరు పంచాయతీలో పలు పోలింగ్ బూత్‌ల వద్ద ఈవీఎంలతో ఓటర్లకు గురువారం అవగాహన కల్పించారు. సాంకేతిక లోపాలపై కూడా అవగాహన కల్పించారు. ప్రతీ ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

న్యాయవాదుల నిరసన



నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు

పాలకొండ: ఏపీ భూ హక్కు చట్టం రద్దు చేయాలని కోరుతూ స్థానిక బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం నిరసన చేపట్టారు. స్థానిక సబ్ కోర్టు ఎదురుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు మురళీమోహన్, జి.సత్యంనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ఏపీ భూ హక్కు చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మంనాయుడు, జగన్మోహనరావు, వెంకటేశ్వరరావు, కిరణ్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



పోలింగ్ కేంద్రాలలోని సౌకర్యాలపై ఆరా తీస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

గరుగుబిల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అవసరమైన ర్యాంప్‌లు, తాగునీరు, విద్యుత్, వంట గదులు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ఓటు హక్కును వినియోగించే దివ్యాంగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ర్యాంపులను నిర్మించాలన్నారు. సౌకర్యాల వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. సౌకర్యాల కల్పనపై అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఆయన వెంట ఎంఈఓ కె.కొండలరావు, ఏపీఓ వై.శంకరరావు, సీఆర్‌పీలు బి.రామకృష్ణ, శంకరరావు, యశోద, సిబ్బంది రమణమ్మ ఉన్నారు.

గాలికుంటు వ్యాధిపై తస్మాత్...



గాలికుంటు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న మండల పశు వైద్యాధికారిణి శైలజ

కురుపాం: గాలికుంటు వ్యాధి పశువులకు సోకకుండా పాడి రైతులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని కురుపాం మండల పశువైద్యాధికారిణి శైలజ రైతులకు సూచించారు. మండలంలోని బొత్తిలి గ్రామంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 150 పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా టీకాలను వేసిన అనంతరం రైతులకు పశు వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయ అధికారి నరేంద్ర, గ్రామ పశువైద్య సహాయక అధికారిణి ఉషారాణి, రైతులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమయ్యాం..

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



మక్కువలో పర్యటిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, తదితరులు

మక్కువ: ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజలతో మమేకమయ్యామని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండల కేంద్రంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఒక్కో ఇంటికి కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజన్నదొర మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిందన్నారు. సాలూరు నియోజకవర్గంలోని 89 సచివాలయాల పరిధిలో 211 రోజుల పాటు గడప గడపకు.. కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల కష్ట,సుఖాలను దగ్గర నుంచి చూసే అవకాశం కలిగిందన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించామని చెప్పారు. రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇటువంటి బృహత్తర కార్యక్రమం చేపట్టారన్నారు. పేద ప్రజలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు గ్రామస్తులు రాజన్నదొరకు హారతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, ఎంపీపీ మర్రి పారమ్మ, వైఎస్సార్‌సీపీ మండల ప్రెసిడెంట్ మావుడి రంగునాయుడు, ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, ఐసీడీఎస్ సీడీపీఓ అనంతలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలే కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ఎన్నికల ప్రక్రియలో బూత్ కమిటీలే కీలకమని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బూత్ కమిటీ నియామకాలపై పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. బూత్‌ల వారీగా కమిటీలు ఏర్పాటు చేయడం, వారితో పార్టీ కేడర్‌ను పటిష్టపరచడంపై సూచనలు అందించారు. త్వరితగతిన బూత్ కమిటీలను ఏర్పాటుచేయాలని కోరారు. 67పోలింగ్ బూత్‌లకు కమిటీలు ఏర్పాటుచేయడం, రానున్న సాధారణ ఎన్నికల్లో మరింత సమర్థవంతంగా వారు పనిచేసేలా చూడాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో గతంలో కంటే అత్యధిక మెజార్టీతో పార్టీని విజయపథంలో నడిపించాలని పిలుపునిచ్చారు. అందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కార్యోన్ముఖుడై సమర్థవంతంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు పకీరునాయుడు, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో సామాజిక చైతన్యం



భాసూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, స్థానికులు

పాలకొండ రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సామాజిక చైతన్యం వెల్లివిరుస్తుందని భాసూరు సర్పంచ్ ఎస్.మల్లేశ్వరమ్మ అన్నారు. తమ సచివాలయ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ చూపిన బాటలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించడం హర్షణీయమన్నారు. అన్ని వర్గాల వారికి సామాజిక, రాజకీయ ప్రాధాన్యత లభిస్తుండడం మనం చూస్తున్నామన్నారు. ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.గురునాయుడు, గొర్ల రాంబాబు, మజ్జి సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

రేగిడి: మండలంలోని లచ్చారాయపురం, వప్పంగి గ్రామాల్లో వైఎస్సార్ కల్యాణమస్తు దరఖాస్తులను ఏపీఎం బి.గోవిందరావు గురువారం పరిశీలించారు. లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి, వారి అర్హతల ధ్రువపత్రాలు చూశారు. అర్హులందరికీ పథకం వస్తుందన్నారు.

ఉద్యోగులకు అండగా ఉంటాం..



ఏపీ ఎన్‌జీఓ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌డీఓ లావణ్య, సంఘ నాయకులు

పాలకొండ రూరల్: ఉద్యోగులకు ఎల్లవేళలా ఏపీ ఎన్‌జీఓ సంఘం అండగా ఉంటుందని ఆ సంఘ పార్వతీపురం మన్యం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇ.లిల్లీపుష్పనాథం అన్నారు. ఎన్‌జీఓ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆర్‌డీఓ లావణ్య గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు తమ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను ప్రస్తావించారు. ఉద్యోగులు ఐక్యతతో ముందుకు వెళ్లాలన్నారు. ఎన్‌జీఓ సంఘ అధ్యక్షుడు కె.రంగాచారి, ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, రెవెన్యూ అసోషియేషన్ డివిజన్ అధ్యక్షుడు ఎం.సావిత్రి, జిల్లా ఉపాధ్యక్షులు బి.బుచ్చయ్య, పి.వెంకటరరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు



సమగ్ర సర్వే ప్రాప్తికి నోటీసులు సిద్ధం చేస్తున్న రెవెన్యూ అధికారులు

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వే ప్రక్రియ ప్రాప్తికి భూ హక్కుదారుల నుంచి వచ్చే ఫిర్యాదులు పరిష్కరించేందుకు 9లో 2 నోటీసులు సిద్ధం చేయిస్తున్నట్టు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. గురువారం వీఆర్‌ఓల పర్యవేక్షణలో ఈ నోటీసుల ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పట్టణంలో 20 వార్డుల పరిధిలో దాదాపు 11 వందల మంది భూ హక్కుదారులు, యజమానులకు చెందిన 1528 ఎకరాల భూమిని రీ సర్వే చేయటం జరిగిందన్నారు. దీనికి సంబంధించిన భూ రికార్డులు అర్హులకు అందించే ప్రక్రియలో భాగంగా చిన్నచిన్న సమస్యలు తలెత్తకుండా ఈ నోటీసులు అందిస్తామన్నారు. వాటి ద్వారా 15 రోజుల వ్యవధిలో సేకరించిన ఫిర్యాదులను సరి చేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు బలివాడ సాయిశ్రీనివాస్, పాలవలస రమేష్, శ్రావణ్, మేఘన, భాస్కరరావు, రామారావు, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అవగాహన అవసరం



గిరిజనులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకొండ రూరల్: ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం ద్వారా గిరిజనులకు అందించనున్న సౌకర్యాలపై అవగాహన పెంచుకోవాలని హౌసింగ్ ఏఈ మాధవరావు అన్నారు. మండలంలోని ఎం.సింగుపురం పంచాయతీ పరిధిలో గల పూర్తిస్థాయి గిరిజన ఆవాసాల్లో సర్పంచ్ రణస్థలం రమాదేవితో కలసి అవగాహనా కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాల్లో భాగంగా పక్కా గృహ నిర్మాణాలపై గిరిజనులకు అందిస్తున్న రాయితీలపై వివరించారు. జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా మండలంలో 26 గృహాలు మంజూరైనట్టు వివరించారు. ఈ క్రమంలో వెలగవాడ సచివాలయ పంచాయతీ పరిధి గిరిజన ఆవాసాల్లో ఎంపీడీఓ డొంక త్రినాథులు తన సిబ్బందిని కలసి అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు.

రైతులను ఇబ్బందులు పెట్టొద్దు

పాలకొండ రూరల్: రైతుల నుంచి నిబంధనల మేరకు ధాన్యం సేకరణ సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. మండల పరిధిలో బ్యాంక్ గ్యారంటీలు పొందిన రైస్ మిల్లులను ఆకస్మికంగా గురువారం ఆయన సందర్శించారు. ట్రక్ షీట్ ప్రాప్తికి వాహనాల ద్వారా మిల్లుకు వస్తున్న ధాన్యం ఆలస్యం చేయకుండా అన్‌లోడ్ చేయించాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలన్నారు. అన్నదాతల నుంచి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా మిల్లర్లు చూసుకోవాలన్నారు. రైతులు ఆర్‌బీకేల ద్వారా తమ వద్ద ఉన్న ధాన్యం అమ్మకాలను చేపట్టాలన్నారు. ఈ క్రమంలో పలువురు రైతుల సందేహాలను తహసీల్దార్ నివృత్తి చేశారు. ఆయన వెంట సీఎస్‌డీటీ ఎ.మల్లేశ్వరరావు ఉన్నారు.

మండలస్థాయి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు



సీతానగరం: క్రీడల్లో పాల్గొన్న యువకులు

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో యువకులంతా క్రీడల పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. గురువారం సీతానగరం ప్రాథమిక పాఠశాల క్రీడా మైదానంలో షటిల్‌కాక్, టెన్నిస్ క్రీడలను జోగింపేటలో జరుగుతున్న వాలీబాల్, సీతానగరం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్రికెట్ పోటీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సచివాలయాల్లో బుధవారం జరిగిన క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విజేతలు మండలస్థాయిలో జరుగుతున్న క్రీడల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీ ఫైనల్స్‌లో జానుమల్లువలస, పెదంకలాం టీంలు పాల్గొనగా జానుమల్లువలస టీం విజేతగా నిలిచింది. కబడ్డీ పోటీల్లో గుచ్చిమి యువకులు విజేతగా నిలిచారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఎంఈఓలు జి. సూరిదేముడు, ఎం.వెంకటరమణ, ఆయా గ్రామాల వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు



పింఛన్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ ఎం.బాబ్జీ

సీతానగరం:

జగనన్న ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు, అర్హులైన వారందరికీ వైఎస్సార్ పింఛన్ కానుకలు అందజేస్తున్నట్లు జెడ్పీటీసీ ఎం.బాబ్జీ అన్నారు. ఈ మేరకు లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ అక్కపోలు సింహాచలం ఆధ్వర్యంలో గురువారం జరుగుతున్న వైఎస్సార్ నూతన పింఛన్ కానుకల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించినపుడు పింఛన్లు కావాలని ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి వైఎస్సార్ పింఛన్ కానుకలు మంజూరు చేయించారని తెలిపారు. ఈ నేపథ్యంలో లచ్చయ్యపేట గ్రామానికి 393, కొత్తగా 17 పింఛన్ కానుక రూ.3వేలు వంతున పంపిణీ చేసినట్లు తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందిన వారందరూ మళ్లీ జగనన్ననే సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, గ్రామవలంటీర్లు పాల్గొన్నారు.

రేషన్ సరుకుల పంపిణీ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు

సీతానగరం: జనవరి నెలలో పండగ ఉన్న కారణంగా ప్రజలకు రేషన్ సరుకులు నిర్దేశించిన గడువులోగా వినియోగదారుల ఇళ్ల వద్ద పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోవిందరావు అన్నారు. ఈ మేరకు గురువారం సీతానగరం మండలంలోని రామవరం, కాశీపేట, అంటిపేట గ్రామాల్లో జరుగుతున్న రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రామవరంలో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రేషన్ డిపోలకు నిర్దేశించిన గడువులోగా బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ పిండి పంపిణీ చేశామన్నారు. డీలర్లు ప్రభుత్వం సమకూర్చిన వాహనాల ద్వారా సరుకులను వినియోగదారులకు గడువులోగా పంపిణీ చేసేలా తహసీలార్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు పర్యవేక్షించాలని కోరారు. ఈ మేరకు గ్రామాల్లో రేషన్ సరుకుల పంపిణీపై కలెక్టర్ సూచనల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్వీ రమణ, సీఎస్‌డీటీ రమేష్‌బాబు, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

రూ. 1100 కోట్లతో అభివృద్ధి..

- చేసిన అభివృద్ధి టీడీపీ నాయకులకు కనిపించకపోవడం శోచనీయం
- డిప్యూటీ సీఎం రాజన్నదొర



విలేకరులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మక్కువ: సాలూరు నియోజకవర్గాన్ని 1100 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించామని చెప్పారు. గడప గడపకు.. కార్యక్రమం నియోజకవర్గంలో గురువారంతో ముగిసింది. దీంతో ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, గడప గడపకు.. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇటువంటి కార్యక్రమం చేపట్టలేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు ప్రతి గడపకూ వెళ్లడంతో స్థానిక సమస్యలెన్నో పరిష్కారమయ్యాయని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో మండలానికి ఏడాదికి రెండు కోట్ల రూపాయలు కేటాయిస్తే... ప్రస్తుత ముఖ్యమంత్రి ఏడాదికి సుమారు 60 కోట్ల రూపాయలు మంజూరు చేశారని తెలిపారు. సాలూరు నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసినా, ప్రతిపక్షాలకు కనిపించకపోవడం శోచనీయమన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పాలనను ప్రజల ముంగిటకు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

స్వర్ణాంధ్ర ఒట్టిమాటే...

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు బుధవారం బొబ్బిలిలో జరిగిన సభలో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర అన్నారు. నందమూరి తారక రామారావు నుంచి అధికారం లాక్కొని 14 ఏళ్లు పాలించినప్పుడు స్వర్ణాంధ్ర ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ 2018,19 సంవత్సరాల్లో చంద్రబాబు లక్ష కోట్లు అవినీతి చేశాడని, లక్షలాది ఎకరాలు దోచుకున్నాడని చేసిన ఆరోపణలు బాబుకు వినిపించలేదా అని చురకలంటించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుమారు 3,648 కిలోమీటర్లు ప్రజా సంకల్ప యాత్ర చేసి ప్రజలతో మమేకమయ్యాడని, అనంతరం ప్రజాశీస్సులతో ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు.

అటువంటి నాయకుడ్ని విమర్శించే అర్హత టీడీపీ నాయకులకు లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, ఎంపీపీ మర్రి పారమ్మ, వైఎస్సార్‌సీపీ మండల ప్రెసిడెంట్ మావుడి శ్రీనివాసరావు, ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చినగుడబలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

గరుగుబిల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించడం, వివిధ పథకాలకు కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించడం జరుగుతుందని మండల విస్తరణాధికారి ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని చినగుడబలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన కల్పించేందుకు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల వివరాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రచార రథాలు, మొబైల్ వాహనాల ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 25 వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర టీం సభ్యులు గఫూర్, విల్సన్ అవగాహన కల్పించారు. సర్పంచ్ ఎం.దుర్గా ప్రసాద్, కార్యదర్శి పి.శిరీష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ గోపాలరావు